క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం



బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట పట్టణ పరిధిలోని 6వవార్డు దాసాయిగూడెం గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జెడ్పీటీసీ జీడి భిక్షం, కౌన్సిలర్ ధరావత్ నీలబబాయిలింగానాయక్, చిలుముల సునీల్‌రెడ్డి, గుండెబోయిన లక్ష్మయ్య, సైదిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి గౌడ్

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బీసీ కుటుంబానికి బీసీ బంధు ప్రవేశపెట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలని అన్నారు. బీసీ బంధు ద్వారా కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందించాలని కోరారు. బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొంతరబోయిన గణేష్, పుట్ట రాజు గౌడ్, కొంపెల్లి మహేష్, ప్రశాంత్, బద్రి, మహేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తుంగతుర్తి : మండల పరిధిలోని దేవునిగుట్ట తండాలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వెంపటి గ్రామానికి చెందిన దాయం విక్రంరెడ్డి కుమార్తె ఝాన్సీ సోమవారం రూ.10,000 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

తిరుమలగిరి : తిరుమలగిరి ఎస్‌ఐ శివకుమార్‌పై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు లాకవత్ నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూవివాదానికు సంబంధించిన ఓ కేసులో ఈ నెల 18న ఎస్‌ఐ శివకుమార్ తనను స్టేషన్‌కు పిలిపించారని, గదిలో బంధించి తీవ్రంగా కొట్టాడని తెలిపారు. అకారణంగా నోటికి వచ్చినట్లు తిట్టాడని పేర్కొన్నాడు. దీంతో మనస్తాపం చెంది క్రిమిసంహారక మందు తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని తెలియజేశారు. అకారణంగా కొట్టి, తిట్టిన విషయంపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

తూమును తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి



వృథాగా పోతున్న రామసముద్రం నీరు

నూతనకల్ : చెరువు నీటిని వృథా చేయడం కోసం తూము తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తాళ్లసింగారం గ్రామస్తులు అధికారులను కోరారు. చేపల కాంట్రాక్టర్ సోమవారం తాళ్లసింగారం రామసముద్రం చెరువు తూమును తీయడం వల్ల నీరు వృథాగా పోతుందని అంటున్నారు. పంట పొలాలపై నీరు పారడంతో పొలాలు జాలువారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తూము తీస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాని, నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాస్టర్‌కు సన్మానం

భానుపురి : పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్న రెవరెండ్ వెల్లస్లీ బదిలీపై సిరిసిల్ల సీఎస్‌ఐ చర్చికి వెళ్లారు. ఈ సందర్భంగా పాస్టర్ దంపతులను సోమవారం సూర్యాపేట మున్సిపల్ క్రిస్టియన్ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలు పెద్దపంగా స్వరూప రాణి సంఘ పెద్దలతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ బత్తుల ఝాన్సీ రమేష్, సంఘ ట్రెజరర్ భాస్కర్, ఈసీ మెంబర్స్ డి.ప్రభాకర్, వల్లమల డేవిడ్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పూర్ణ శశికాంత్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్‌ను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

రైతు నెత్తిన విత్తన భారం

- రూ.43 పెరిగిన పత్తి విత్తన ధరలు
- పెట్టుబడి ఖర్చులు అధికమవుతుండటంతో ఆందోళన చెందుతున్న రైతులు

నాగారం : ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షాలతో నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికితోడు పెట్టుబడుల వ్యయం పెరిగి రైతులు ఆందోళన చెందుతుంటే ప్రస్తుతం పత్తి విత్తన ధరలు పెరిగాయి. ఒక్కో కాటన్ సీడ్ ప్యాకెట్‌పై రూ.43 చొప్పున ధర పెరిగింది. రూ.810 ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ ధర ప్రస్తుతం పెరిగిన ధరతో రూ.853కు చేరింది. పత్తి విత్తన ధరలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారుల అంచనా ప్రకారం నాగారం మండలం పరిధిలో దాదాపు ఆరు వేల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఈ లెక్కన 12,000 పత్తి విత్తన ప్యాకెట్లు మండలంలో అవసరం. పెరిగిన ధరలతో మండలంలో రైతులపై రూ.5,16,000 లక్షలకు పైగా అదనపు భారం పడనుంది.

పెరుగుతున్న పెట్టుబడులు..

గతంతో పోలిస్తే ఎరువులు, విత్తనాలు, మందులు, కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ సీడ్ కంపెనీలు రైతుల నుంచి పత్తి విత్తనాలను సేకరించి, గ్రేడింగ్ చేసి జర్మినేషన్ చెక్ చేసి ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నాయి. రైతుల నుంచి సీడ్ కంపెనీలు కొన్న పత్తి విత్తనాలు, సీడ్ ప్యాకెట్ల రూపంలో తిరిగి రైతులకు చేరే సరికి భారీగా ధర పలుకుతున్నాయి. 2020–21 ఆర్థిక సంవత్సరంలో సగటున రూ.730గా ఉన్న పత్తి సీడ్ ప్యాకెట్ ధర, ప్రస్తుతం రూ.853కు చేరింది. నాలుగేళ్ల వ్యవధిలో రూ.123 మేర ధర పెరిగింది. ప్రతి సంవత్సరం సగటున రూ.30 చొప్పున సీడ్ ప్యాకెట్ల ధరలు పెరిగాయి. ఎకరానికి దాదాపు 2 ప్యాకెట్ల వరకు అవసరం అవుతుండటంతో రైతుల ఖర్చులు అధికంగా పెరుగుతున్నాయి. ఏటా విత్తన ధరలు, క్రిమి సంహారక మందులు, యంత్రాల వినియోగ చార్జీలు, కూలీల ధరలు పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వం విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని, ధరల నియంత్రణపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



పత్తి విత్తనాలు

విత్తన ధరలు తగ్గించాలి



రైతులపై ఆర్థిక భారం పడకుండా పత్తి విత్తన ధరలను తగ్గించాలి. ఇప్పటికే అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పాటు, పెట్టుబడులు పెరిగిపోయాయి. ఇప్పుడే ప్రభుత్వం విత్తన ధరలు పెంచడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తన ధరలను తగ్గించి రైతులను ఆదుకోవాలి.

– గంట మహేష్, రైతు, వర్ధమానుకోట

కంపెనీలకు లాభం చేకూర్చేందుకే...



విత్తన కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ఏటా ధరలు పెంచుతున్నారు. ప్రభుత్వం పెంచిన ధరలతో పాటు సబ్సిడీ కూడా పెంచాలి. అలా అయితేనే రైతులకు నష్టం జరగదు. పెట్టుబడులు ఇప్పటికే చాలా పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలి.

– దోమల బాలమల్లు, రైతు, నాగారంబంగ్లా

గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలి

దురాజ్‌పల్లి : జిల్లా వ్యాప్తంగా గొల్ల కురుమలకు ప్రభుత్వం అందజేస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీకి బదులుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రవి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మొదటి విడత పంపిణీ చేసిన గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. రెండో విడతలో డీడీలు కట్టిన వారందరికీ నగదు బదిలీ చేయాలని అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కడం లింగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వజ్జ వినయ్‌యాదవ్, జిల్లా నాయకులు కొమురెల్లి, ఉప్పల ఐలయ్య, శ్రీనివాస్, వజ్జా సాయి, జాల జానయ్య, వల్లాల కోటి యాదవ్, కాచాని సుజాత, వజ్జ జయమ్మ, సైదులు యాదవ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాష్ట్ర సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని డీబీఎస్‌యూ జిల్లా ఇన్‌చార్జ్ దాసరి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రూ.272 చెల్లించాలని.. రోజు కూలి రూ. 600లకు పెంచాలన్నారు. రెండు సార్లు ఫొటోల అప్‌లోడ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు, ఆటో ఛార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నందిపాటి పుష్పలత, మామిడి సైదులు, సముద్రాల శ్రీనివాస్, కర్నాటి సైదులు, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహ్మదాపురంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధి కూలీలు

దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట

మద్దిరాల : దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం చిన్ననెమిల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామాంజనేయ స్వామి, శ్రీ ఉమా రామలింగేశ్వరాస్వామి దేవాలయల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్న గౌడ్, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, గుడ్ల వెంకన్న, చంద్రమౌళి, మల్లు కోటింగారెడ్డి, సర్పంచ్ సూరారపు గౌతమి రాజు, ఎంపీటీసీ సుంచు అవిలయ్య, కోఆప్షన్ మెంబర్ సాహెభూషణ్, ఉత్సవ కమిటీ చైర్మన్ నడిపెల్లి ఉపేందర్ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చిన్ననెమిలలో దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తుది దశలో ధాన్యం కొనుగోళ్లు

- జాజిరెడ్డిగూడెం మండలంలో 21కేంద్రాల ద్వారా కొనుగోళ్లు
- లారీలు సకాలంలో రాక కొంత ఇబ్బంది

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుదిదశకు చేరింది. ఇప్పటి వరకు 90శాతం వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. వడగళ్ల, అకాల వర్షాలతో ఈసారి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగింది. లారీల కొరతతో సకాలంలో ధాన్యం ఎగుమతి కావడంలేదు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 90శాతం వరకు కొనుగోళ్లు చేపట్టారు. మిగిలిన 10శాతం పూర్తి కావాల్సి ఉంది.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

యాసంగి సీజన్‌కుగాను జాజిరెడ్డిగూడెం మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు మండలంలో 4,83,825 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఇందులో 4,53,444 బస్తాల ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేశారు. ఇంకా కేంద్రాల్లో 30,381 బస్తాల ధాన్యం కాంటాలు వేసి ఉంచారు. వీటిని మిల్లులకు పంపాల్సి ఉంది. లారీలు సకాలంలో రాక ఈ ధాన్యం ఎగుమతిలో కొంత ఇబ్బంది అవుతుంది. కాగా ధాన్యం అమ్మిన రైతులకు మాత్రం ఎప్పటికప్పుడు వారి బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమ అవుతున్నాయి. మరో వారం రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేయాలని అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.



అర్వపల్లిలో లారీకి ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

200బస్తాలకు 100బస్తాల ధాన్యం అమ్మాను



ఈ యాసంగిలో 200బస్తాల ధాన్యం పండించగా అర్వపల్లి కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 100బస్తాల ధాన్యాన్ని అమ్మాను. ఇంకా కేంద్రంలో మరో 100బస్తాల ధాన్యం అమ్మడానికి ఉంది. లారీలు సరిగా రాక కొనుగోళ్లకు ఇబ్బంది అవుతుంది.

– రామసాని శ్యాంసుందర్, రైతు, కొత్తగూడెం

లారీల కొరతను అధిగమిస్తున్నాం



మండల వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల కొరతను అధిగమిస్తూనే మిల్లులకు తరలిస్తున్నాం. ఇప్పటి వరకు 90శాతం మేర కొనుగోళ్లు పూర్తయ్యాయి. మరో వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేసేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 4.83 లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.

– పి.యాదగిరిరెడ్డి, మండల నోడల్ అధికారి

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తిరుమలగిరి : పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి



అర్వపల్లి : రామన్నగూడెంలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉపేందర్‌రావు

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అర్వపల్లి : పల్లెలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఉపేందర్‌రావు కోరారు. ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా సోమవారం రామన్నగూడెం, అర్వపల్లి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శులు నవీన్‌రెడ్డి, మాగి నాగయ్య, గ్రామపంచాయతి కార్మికులు పాల్గొన్నారు.

అడ్వకేట్ యుగేంధర్‌పై దాడి హేయమైన చర్య

తుంగతుర్తి : అడ్వకేట్ యుగేంధర్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఎమ్మెల్యే దళితులను కించపర్చేలా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అక్రమాలకు, అవినీతికి, ఇసుక మాఫియాకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిపై దాడులకు పాల్పడటం తగదన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు లక్ష్మయ్య, రామన్న, రోశయ్య, సుధాకర్, కర్ణాకర్, పరశురాములు, పుష్ప, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

అర్వపల్లి : తిరుమలగిరి మండల కేంద్రంలో అఖిల పక్ష సమావేశానికి హాజరై తిరిగి వెళుతున్న తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది పఱ్రెపాటి యుగేంధర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి డిమాండ్ చేశారు. సోమవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధులో జరుగుతున్న అవకతవకలపై మాట్లాడినందుకు ఆయనపై ఉద్దేశపూర్వకంగా పథకం ప్రకారం హత్యాయత్నం చేశారని విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోజురోజుకు బీఆర్‌ఎస్ దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్ గౌడ్, దాసరి సోమయ్య, కృష్ణమూర్తి, విక్రం, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



నాగారంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల

నాగారం : సీఎం కప్ క్రీడా పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన 35 మంది క్రీడాకారులకు నాగారం మండల కేంద్రంలోని మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో గుంటకండ్ల సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శోభారాణి, సూపరింటెండెంట్ ముత్తయ్య, కార్యదర్శి కొమ్ము అరుణ్, గ్రామస్తులు చిప్పలపల్లి సోమయ్య, కూరం వెంకన్న పాల్గొన్నారు.

సోమమ్మ మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పిన్నాని కోటేశ్వర్‌రావు మాతృమూర్తి సోమమ్మ(81) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో సోమవారం ఆమె మృతదేహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బీఎస్పీ కార్యవర్గం ఎన్నిక

చిలుకూరు : బహుజన సమాజ్ పార్టీ చిలుకూరు మండల నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుకూరుకు చెందిన కొండా ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ (బేతవోలు), ప్రధాన కార్యదర్శిగా గద్దల వీరబాబు (కొండాపురం) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిగొండ నాగయ్య, కందుకూరి శ్రీను, ముదిగొండ వెంకట్, వెంకన్న, మేరీ, కాంపాటి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

నూతనకల్ : దివ్యాంగుల సౌకర్యార్థం ఆర్టీసీ అందిస్తున్న బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాస్ మేళాలో పాల్గొని మట్లాడారు. 50శాతం రాయితీతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకు వీలుగా అందిస్తున్న అవకాశాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బస్‌పాస్ మేళాలో 22మందికి బస్‌పాస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్‌బాబా, బాణాల వీరారెడ్డి, గుండగాని ఉపేందర్, రామచంద్రు, మమత, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్ కరుణశ్రీగిరిధర్‌రెడ్డి

తప్పుడు ప్రచారం చేయొద్దు

నూతనకల్ : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌పై కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి బత్తుల విద్యాసాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్‌మండల నాయకులు బత్తుల సురేష్, మిర్యాల చిరంజీవి, మూరగుండ్ల మహేందర్, మాతంగి విజయ్‌కుమార్, శ్రావణ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌పై ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేయడం తగదని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ చెరుకు సృజన పరమేష్, సర్పంచ్ విజయ్, నాయకులు తడకమళ్ల రవి, మనోజ్, ముత్తిలింగం, సోమయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

నాగారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన ఫణిగిరిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఫణిగిరికి చెందిన రైతు వంగూరి కొమరయ్య రోజు వారిగానే తన పశువులను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్లాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఎద్దు విలువ సుమారు రూ.70వేలు వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ఆత్మకూర్ (ఎస్) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని మిడ్తనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్తనపల్లి గ్రామానికి చెందిన జటంగి బుచ్చయ్య, గుండెబోయిన కృష్ణయ్యలకు చెందిన గేదెలు మేత కోసం గ్రామ శివారులోని నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామం వైపు వెళ్లాయి. అయితే ఇటీవల ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడడంతో ఆ తీగలు తగిలి విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి.

అర్వపల్లి : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామ శివారులోని గంగదేవమ్మ గుడి వద్ద ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అయితే గ్రామంలోని తొట్టె లింగయ్యకు చెందిన పాడి గేదె మేత కోసం వెళ్లి తెగిపడిన విద్యుత్ వైర్లను తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ గేదె సుమారు రూ. 60 వేలకు పైగానే ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



లక్ష్మాపురంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుధాకర్

నాగారం : అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కుంటపల్లి సుధాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడొద్దని రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో 75 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏగూరి మంజుల, డాక్టర్ నాగునాయక్, వైద్యసిబ్బంది గాజుల సోమయ్య, యాదగిరి, స్వప్న, గ్రామస్తులు దేశగాని నర్సయ్య, సోమయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రభాకర్ చేసిన పోరాటం మరువలేనిది



అర్వపల్లి : తిమ్మాపురంలో ప్రభాకర్ స్మారక స్థూపానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రభాకర్ చేసిన పోరాటం ఎప్పటికీ మరువలేనిదని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీసీపీ నేత మండారి ప్రభాకర్ 4వ వర్ధంతిని సోమవారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీసీపీ రాష్ట్ర నాయకుడు గాజుల శ్రీనివాస్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, సీపీఐఎంఎల్ రామచంద్రన్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, సీపీయూఎస్‌ఐ రాష్ట్ర నాయకుడు గద్దపాటి సురేందర్, చామకూరి నర్సయ్య, శంకర్, సైదులు, వెంకట్‌యాదవ్, తిరుపతి, శ్రీకాంత్‌గౌడ్, విజయ్, మురళి, దాస్, ప్రభాకర్ సతీమణి నిర్మల, ఏకలవ్య, ఆజాద్ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో 200 రోజులు పని కల్పించాలి

మునగాల : ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆకుపాములలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో పని దొరకకపోవడంతో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల వలసలు నివారించేందుకు ఉపాధి హామీలో పనిదినాలు పెంచాలని కోరారు. పెరిగిన ధరలతో పోల్చితే ప్రస్తుతం వస్తున్న కూలి సరిపోవడం లేదని అన్నారు. రోజుకు రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేవలం రూ.50 నుంచి 100లోపు మాత్రమే కూలి గిట్టుబాటవుతుండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామంపగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె.రామకృష్ణారెడ్డి, ఉపాధి హామీ మేట్లు చంద్రమ్మ, వెంకటయ్య, గోపయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం నడిగూడెం మండలం చెన్నకేశవపురం గ్రామానికి చెందిన కొత్త ఉపేందర్– సుధారాణి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. అలాగే దుస్తులు పంపిణీ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యుడు అయిన ఉపేందర్ వృద్ధులకు, మానసిక వికలాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు కొత్త రుత్విక, పూజ, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.